# ఆమె చివరకు నవ్వింది

రాత్రి పదకొండు గంటలు; సికింద్రాబాదు స్టేషను ఎదురు ఆవరణ. పాలబుడ్ల విద్యుద్దీపాల కాంతులు చంద్రుని వెలుగుల్లా ఆ ఆవరణ నింపేశాయి, ఆ చీకటి రాత్రి.

చీకటిని ఛేదించ కలిగిన మానవ యత్నంలా, ప్రకృతికి ఎదురీదే మానవశక్తిలా, అసాధారణమైన మానవజీవితాలు గుంపుగా గూడినట్లనిపించింది. అక్కడి ఆవరణ చప్టామీద కూర్చున్నా తిరుగుతున్నా మాట్లాడుతున్నా, వ్యక్తుల్ని చూస్తే ముఖ్యంగా, వారందరిమధ్య నిర్లక్ష్యంగా తిరిగే ఆమెను చూస్తే.

"ఫాట్" గేటుదగ్గర గోడకానుకొని గోనుసంచిమీద పడుకున్న వ్యక్తిని పలకరించింది ఆమె.

"ఏరా నారిగా! అలా దిగులుగా ఒరిగావే."

'ఈ రోజు పైసా బణిలేదు!'

"అరెరె! ఈ సిగరెట్టు తీసుకో! పెట్టెలోంచి ఒక సిగరెట్టు యిచ్చింది. తాను కాలుస్తున్న సిగరెట్టు బాధలో అప్రయత్నంగా చేతితో నలిపి అవతల పారేసింది.

'ఏయ్! పోచమ్మా. అణా టీ యివ్వు!' ఎగిరే ముంగురులు సర్దుకుంటూ అల్లరిచేస్తూ పోచమ్మ బుజంమీద వాలింది ఆమె. గ్లాసులో టీ పోసి యిచ్చింది పోచమ్మ.

'...కాస్త ఒళ్లు తేలికవుద్ది!' అప్యాయంగా, దగ్గరికి వెళ్లి నారిగాడి మూతిదగ్గర పెట్టింది టీ గ్లాసు ఆమె. వాడ్దరి

వీధిప్రేమ చూసిన సాక్షిగా ప్రక్కనే నిటారుగా నిలుచున్న పిప్పల వృక్షము ఆనందంలో చిరుగాలి కదలికలలో వూగింది.

'నీ దగ్గర పైసలున్నాయన్నమాట!'...

నారిగాడు టీ చప్పరించాడు.

'ఈ వేళ సంపాదించానులే! ఒక రూపాయి దొరికింది!

'కూలి చేశావా?'

'కాదు—దొంగతనం!!'

ప్రశ్నార్థకంగా చూశాడు నారిగాడు.

'ఓయమ్మ రైలుదిగి టిక్కెట్టు పైసలు సర్దుకుంటూ నడుస్తోంది...బెడ్డింగు యీ యమ్మ మోసుకొస్తానంటూ ఎదురువెళ్ళి కొట్టేను. చెయ్యి పట్టువదలి చేతిలో రూపాయలు క్రింద పడ్డాయి. అరెరె అంటూ అన్నీ వెదికి యిచ్చాను ఆయమ్మకు...కాని నా కాలిక్రింద రూపాయి ఆయమ్మ చూడందే...

'నారిగాడు నవ్వాడు...'

"కళ్ళజోడుందిలే...నాలుగు కళ్ళ ఆసామీలు అంతే... రెండుకళ్ళు పైన...రెండుకళ్ళు గ్రుడ్డి...ఇంక తక్కినలోకం కనపడదు! డబ్బున్నవాళ్ళు!...పకపక నవ్వింది.

ఆమె...

పైగా కూలి చేసినందుకు పావలా యిచ్చింది! ఆమె సిల్కు జేబు రూమాలులోని చిల్లరలోంచి అణాతీసి పోచమ్మ కిచ్చింది.

'అక్కాయ్—రా—పడుకుందాం!' మూరాముచేస్తూ తూలుతూ వచ్చాడు కుర్రా డొకడు ఆమె దగ్గరకు.

'పద!...లేచింది ఆమె.

'ఈ అణా దగ్గరుంచుకో...ఎందుకైనా వస్తది' నవ్వింది ఆమె...

హుషారులో—సిగరెట్టు పెట్టితీసి ఈలపాట మొదలెట్టింది...సిగరెట్టు నోట్లోపెట్టి ఒక రిషూ లైటులో వెలిగించుకొంది...

కర్ర మూలపడేసి, జూలు క్రిందకు దింపుకొని, ఆనాకారి ముసలి శరీరాన్ని నేలమీద కూలుస్తూ—గొణుక్కుంటూ ఒక ముష్టివాడ ఆవరణలోపల గోడకు మూలగా జరిగాడు...

'ఏం తాత' ధర్మాత్ములు ఎంత దానంచేశారు ఈవేళ...

'త్వరగా చచ్చి పొమ్మన్నారు ధర్మాత్ములు! నవ్వాడు పేలవంగా తాత...

'నేనుండగా నువ్వు చావడ మెందుకు...

'ఒరే!

కుర్రాడు దగ్గరకు వచ్చాడు...

'అణా అరటిపళ్లు కొని తాతకియి'

'నాకో'

'తీసుకో!' ఒకపైస కుర్రాడి చేతిలో రాల్చింది ఆమె లంచలా...కుర్రాడు పరుగెత్తాడు.

'తాతా నీకు పక్క వెయ్యనా!'

'పరుపులు తెచ్చావా తల్లి' నవ్వాడు తాత...

'సిమెంటు చప్టా పరుపు ఎంత మెత్తగా ఉంటుందో నీకేం తెలుసు తాతా!...జోలులోంచి ఒక పాతబొంత నేలమీద పరచింది ఆమె...

తాత ఒళ్లునిమిరి ఆలోచనలో ముందుకు కదిలింది ఆమె...

ఆ ఆవరణలో ఒకమూల రెండు గుడ్డలు పరచి హాయిగా నిర్విచారంగా ఒరిగింది సిగరెట్టు కాలుస్తూ...

ఒక టాంగావాలా, ఒక రిక్షావాలా, ఒక స్టేషనుకూలి, ఒక వేరుశనగ అమ్మకందారు...తమ సరంజామాలో ఆమె దగ్గరనుంచి ఒక్కొక్కమారు నడచి పోయారు.

'పో పో' ఈసడిస్తూ కూకలేసింది వాళ్లనందరినీ ఆమె...

టాక్సీలు కాళీకాగా, ఆ స్థలంలో గుంపులుగా చేరి ఆడుకొంటున్నారు జనం.

"కాయ్...వేయ్...ఇటురా...అటు...అరుపులు...నవ్వులు... కేరింతలు...ఒకడు రెండణాల ఖరీదైన పిల్లల సితారా వాయిస్తున్నాడు...

బస్సులరొద అప్పుడప్పుడు...రిక్షా మువ్వలు సోడాల చప్పుళ్లు...రైలు ఇంజను కూతలు...లాలిపాట పాడినట్లు అయింది ఆమెకు...నిద్రమైకంలో దొర్లుతుంది ఆమె...కాకీ పంట్లాం నూనెకారే నల్లటి సిద్దిలాంటి ముఖం...వంకీలలో గీరగా నిలబడినజుట్టు...ఒకడు చేరాడు ఆమె దగ్గిరిగా...

'ఏయ్...కుదిపాడు...ఆమె కదలలేదు...చీరకొంగు ముడి...నిర్లక్ష్యంగా పట్టువదిలిన అరచేతిలో కనిపించింది... విప్పాడు...ముప్పావల చిల్లర. లేచి పంట్లాం జేబులో వేసుకున్నాడు...

ఇటు అటు చూశాడు...ఎవరూ తన్ను గుర్తించినట్లు లేదు...

'కాయ్ రాజా'...అరుస్తూ నడిచాడు గబగబ ఆటగాళ్ల వైపు...

ఒక అడుగు వెయ్యకముందే! బాబోయ్ అంటూ కూలబడ్డాడు...

ఆటగాళ్లు ఆటవిడిచి నారిగాడివైపు వచ్చారు.

ఏమయింది?...

'ఏదో కుట్టింది?'

చుట్టూ కలయజూచారు జనం...ఎర్రతేలు కొండిమి నిలుపుకొని గర్వంగా పరుగెడుతోంది.

చెప్పుతీసి చావబాదాడు ఒక వీరుడు. ఒకడు జేబురుమాలుచింపి కాలికి కట్టుకట్టాడు...విషం ఎక్కకుండా...

నల్గురు కాస్త ఓదార్చి ఎవరి దారిని వాళ్లు వెళ్లిపోయారు.

తేలుబాధకు ఏడుస్తూ ఆమె దగ్గరగాపోయి కూర్చున్నాడువాడు.

ఆమె లేచింది...వాడి ఏడుపుకు మెలుకువ వచ్చింది.

వాడు మరీ బిగ్గరగా ఏడ్చాడు. 'ఏమనుకోక' నీ దగ్గర దొంగతనంచేసా...శాస్తి అయింది నాకు. తీసుకో పన్నెం

డణాలు...ఆమెచేతిలో పెట్టాడు తిరిగి...ఆ డబ్బు. ఆమె కొంగు వెతుక్కుంది...ముడిలేదు...అర్థం చేసుకొంది...

'అయ్యోయ్' ఏడ్చాడు వాడు.

'ఏమయింది?...ఆత్రుతగా అడిగింది ఆమె...

"తేలు...తే..." మాటరాక ఏడుస్తూ మూల్గాడు...

'నీ మొహం...మొగాడివేనా నువ్వు ఏమిటా ఏడుపు... వుండు మందు తెస్తా...స్టేషన్‌లోంచి బిరబిరా వేగంగా నడిచింది...

ఎదురుగావున్న మందులషాపు మేడమీదకు చూసింది...

'ఏయ్ సేటు!' అరచింది ఆమె.

'ఏయ్ సేటు!...' చప్పట్లు చరుస్తు గెంతింది నవ్వుతూ...

ప్రక్కనున్న రిక్షావాళ్లు ఆమెకు సాయం చేశారు అరుపుల్లో...సేటు మేడమీద లైటు వెలిగింది...తూలుతూ... కళ్లు నులుముకుంటూ క్రిందకు చూశాడు.

'ఎవరది'

'ఏయ్ సేటు...మందు కావాలి!'

ఆమె వాలకం సేటుకు అసహ్యం వేసింది...

'పో పో...నీ డబ్బు నీకు పారేస్తా! ఆమె మళ్లీ అరచింది.

సేటు ఒక నిమిషం ఆగి ఆలోచించుకున్నాడు.

క్రిందకువచ్చి కొట్టుతలుపు తీశాడు. 'తేలుమందు'

చేతిలో చిల్లర పూర్తిగా రాల్చింది. కొట్టు దిగి తుపుక్కున ఉమ్మివేసే సేటు ముఖంవైపు చీదరగా చూసి నడిచి వచ్చేసింది...

మందు తెచ్చి వాడి కాలికి రాసింది ఆమె...మర్దన చేసింది...తన ప్రక్కమీద పడుకో బెట్టింది వాడిని.

కాసేపటికి వాడి బాధతగ్గి అలసటగా ఆమె ప్రక్కమీద నిద్రపోయాడు...

వాడిప్రక్కనే కుర్రవాడు కూడ నిద్రమైకంలో ఒళ్లు తెలియక దొర్లుతున్నాడు.

ఆమె కుర్రవాడివైపు చూసింది...ఏమిటో బాధగా ముఖం చిట్లించుకొంది. స్టేషను గడియారం రెండు గంటలు కొట్టింది. ఆటగాళ్లు అదృశ్యమై పోయారు. గుర్రాలు, టాంగాల ప్రక్కగా అంటిపెట్టుకొని సకిలిస్తున్నాయ్...గడ్డి మేస్తూ అప్పుడప్పుడు...

మంచు కురుస్తోంది...వాతావరణం చల్లపడ్డది...

ఆమె తలమీదకు కొంగు ముసుగు వేసుకుంది.

గోడ కానుకొని ముడుచుకొని కూర్చుంది ఆలోచనగా. చేతులు కళ్లకు కప్పుకొని వెక్కి వెక్కి ఏడ్వసాగింది...

కన్నీటి ధారలో పిచ్చిగా చూడసాగింది...

నే నెవరు?...అమ్మ నాన్న ఎక్కడున్నారు? నా బ్రతుకేమిటి? ఎంతకాలం ఇలా...

వెక్కి వెక్కి ఏడ్చింది ఆమె...'ఆకలి!...ఆకలి!... బాధగా కడుపు తడుముకుంటూ మూల్గింది...ఆమె.

"ఆనాడుతీర్థ దంపులు...ఆవిడ ముక్కుపుడక...నీలు చీర...అంతే జ్ఞాపకం...తప్పితే పోయాక...తిరిగి—తిరిగి— ముష్టి...కూలి...కలగలపు బ్రతుకు...నాలుగేళ్లనుంచి పదహారు

వెళ్ళు నడిచాయి...యిప్పుడు...అంతా తెలుసు...కానీ...నే నెవరు?...నే నెవరు? చస్తే...ఎంతకాలం యీ బ్రతుకు... ఆకలితో....దరిద్రంతో.....అనారోగ్యంతో....అన్యాయాల లోకంలో ఎందుకు బ్రతకాలి...చస్తే...నే నెవరు...ఎవరు?

ఏడ్చింది...వెక్కి వెక్కి ఆమె మాటలు గొణుగులో మునిగి పోయాయి.

'ఏయ్' వెనుకనుంచి అరుపు వినిపించింది...

వెనక్కి తిరిగింది ఆమె...

నారిగాడు వచ్చాడు.

'నిద్రపోవే!' నవ్వుతూ దగ్గరికి వచ్చాడు.

'ఉ...నిద్ర రాదు...!' ఆమెకళ్లు ఎర్రబడ్డాయి కన్నీరు కార్చింది.

'ఎందు కేడుస్తున్నావు!' ఆత్రుతగా ప్రశ్నించాడు నారిగాడు...

'ఉ—"...ఏమీ లేదు..." 'పేలవంగా' నవ్వింది ఆమె.

'ఇది తిను!...' సంచిలోంచి చిన్నరొట్టె యిచ్చాడు...

'టాంగా కట్టావా?

'ఉ...అర్ధరూపాయి దొరికింది'

'నువ్వు తిను...'

'నువ్వు తిను...'

ఒకరివైపొకరు ఒక క్షణం నిశితంగా చూసుకున్నారు...

'ఏయ్...టాంగా!' ఎవరో అరుపు.

'వస్తున్నా!' నారిగాడు లేచాడు!

'మళ్లీ వస్తా' ఆప్యాయంగా ఆమెవైపు చూశాడు. రివ్వున వెళ్లిపోయాడు.

బన్నురొట్టె పంటితో కొరికింది ఆమె...

ఒక నల్లకుక్క తోక ఆడించుకుంటూ దగ్గరకి వచ్చింది..' ఈలవేసింది ఆమె...

కుక్క మూతి నాలుకతో చప్పరించుకుంటూ గబగబ తోకఆడిస్తూ ఆమె ఒడిలోకి నడవబోయింది...

'తింటావా ?' ఆమె అడిగింది!

'వ్వూ అంటూ దీర్ఘం తీసింది కుక్క...బన్ను రొట్టె సగంచేసి కుక్కకు పెట్టింది ఆమె...

కుక్క ఠీవిగా తింటూ 'భోయ్' మని మొరిగింది— అలికిడికి—రక్షకభటునిలా.

కుక్కను దువ్వింది ఆమె...తను రొట్టె తింటూ...

తన్ను చూచి నవ్వుకుంది...ఎదురుగా కనిపించే ప్రపంచాన్ని చూచి చివరకు నవ్వింది.

---